# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA | ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 19 | శనివారం | 15-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:19 | Saturday | 15-8-2026 | Pages:08 | Cost:2/-



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


# విద్యతోనే సామాజిక మార్పు, రాజ్యాధికారం

## ఖైరతాబాద్‌లో పూలే దంపతుల విగ్రహావిష్కరణ

## విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హామీ

## కులగణనతో చరిత్ర సృష్టించామని వెల్లడి

## చదువుతో రాజ్యాధికారం సాధించాలని పిలుపు



హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నెక్లెస్ రోడ్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిబా పూలే, శ్రీమతి సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఒకవైపు అంబేద్కర్, మరోవైపు పూలే, ఇంకోవైపు ఇందిరా గాంధీ విగ్రహాల కలయికతో నెక్లెస్ రోడ్ చౌరస్తా మహనీయుల స్ఫూర్తి కేంద్రంగా మారిందని కొనియాడారు. 136 సంవత్సరాల తర్వాత కూడా మనం పూలేను గుర్తు చేసుకుంటున్నామంటే ఆయన ఎంత గొప్ప మార్గదర్శియో ఆలోచించాలని, ఆ మహనీయుల స్ఫూర్తితోనే ప్రతి ఒక్కరూ విద్యలో రాణించాలని పిలుపునిచ్చారు.

- మిగతా 2వ పేజీలో



2లో

## రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై రాష్ట్రపతికి ప్రధాని మోదీ ప్రశంసలు
- రాష్ట్రపతి ప్రసంగం దేశ సుస్థిరతను ప్రతిబింబిస్తోందన్న ప్రధాని
- గత పదేళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రస్తావించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మహిళలు, యువత, పేదల సంక్షేమ పథకాలపై ప్రత్యేక ప్రస్తావన
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు సమిష్టి కృషికి పిలుపు

## వికసిత్ భారత్ కోసం అందరూ కృషి చేయాలి

- రేపు 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం
- జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపు
- ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సిందూర్' గట్టి సందేశం పంపిందన్న ముర్ము
- పరీక్షల విధానంలో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ
- దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చరిత్రాత్మక విజయమన్న రాష్ట్రపతి



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. గడిచిన దశాబ్దంలో ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా దేశం వేగవంతమైన, సమ్మిళిత వృద్ధిని సాధించిందని కొనియాడారు.

- మిగతా 2వ పేజీలో

## 22 కి.మీ. రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారు

- అమరావతి పేరుతో భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న అంబటి
- తాత్కాలిక భవనాలు, స్టీల్ బ్రిడ్జిల పేరుతో వేల కోట్లు తగలేస్తున్నారని ఆరోపణ
- కమీషన్ల కోసం అంచనాల బడ్జెట్ పెంచుకుంటూ పోతున్నారని విమర్శ



2లో



## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు కేటాయించిన తెలంగాణ ప్రభుత్వం

- గోదావరి పుష్కరాలపై రేవంత్ సర్కారు ఫోకస్
- సెప్టెంబర్ నుంచి పనులు ప్రారంభించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశం
- రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక అధికారుల నియామకం
- పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డాష్‌బోర్డ్
- పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఈ పుష్కరాల పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1000 కోట్లు కేటాయించినట్లు

- మిగతా 2వ పేజీలో

## డేటా సెంటర్లకు నీటి సరఫరాపై అది దుష్ప్రచారం మాత్రమే

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రబాబు ఆదేశం
- లోటు వర్షపాతం దృష్ట్యా నీటిని పొదుపుగా వాడాలని అధికారులకు స్పష్టం
- పోలవరం, వెలిగొండ సహా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సూచన
- అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశం



రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్లకు భారీగా నీటిని కేటాయిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. అది కేవలం దుష్ప్రచారమేనని, డేటా సెంటర్ల పూర్తిస్థాయి అవసరాలకు కేవలం 3.5 టీఎంసీల నీరు మాత్రమే సరిపోతుందని స్పష్టం చేశారు. ఈ వాస్తవాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అపోహలను తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం పరిస్థితుల దృష్ట్యా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. నేడు సచివాలయంలో జలవనరుల శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

- మిగతా 2వ పేజీలో



## హిందూ కుటుంబాలను వేధిస్తూ.. మైనారిటీలకు ఉచిత విద్యుత్ ఇస్తారా?

- పాతబస్తీలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని రేవంత్ చెప్పారన్న రాంచందర్ రావు
- విద్యుత్ బిల్లులు చెల్లించని మైనార్టీలపై సానుభూతి ఎందుకని ప్రశ్న
- ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



## రాహుల్ గాంధీకి భారీ ఊరట..

- సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం
- క్రిమినల్ కేసు, దిగువ కోర్టు సమన్లు రద్దు
- యూపీ ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని గుర్తించిన సుప్రీం
- 2022 భారత్ జోడో యాత్రలో రాహుల్ వ్యాఖ్యలు
- 153ఏ, 505 సెక్షన్ల కింద దిగువ కోర్టు సమన్లు
- ప్రభుత్వ అనుమతి తీసుకోలేదంటూ కేసును కొట్టివేసిన సుప్రీంకోర్టు

సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసు కొనసాగించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన అనుమతి పొందలేదని కోర్టు స్పష్టం చేసింది.దజస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు

- మిగతా 2వ పేజీలో

## నేను కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదు


- కాంగ్రెస్ పార్టీలో బయటి నుంచి వచ్చిన వారి పెత్తనం ఎక్కువయిందన్న రాజగోపాల్ రెడ్డి
- రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలతో పార్టీలో రేగిన దుమారం
- తాను పార్టీ నేతలను విమర్శించలేదన్న మునుగోడు ఎమ్మెల్యే



2లో

## హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!

- జనసైనికులకు మరోసారి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం
- సోషల్ మీడియా వాడకంపై జనసేన శ్రేణులకు పవన్ కల్యాణ్ మార్గదర్శకాలు
- వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం వాడొద్దని స్పష్టం
- కూటమి ప్రభుత్వ స్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరించాలని సూచన
- పార్టీ క్రమశిక్షణ, అంతర్గత విషయాలపై 9 కీలక మార్గదర్శకాలు జారీ



2లో

# రాహుల్ గాంధీకి భారీ ఊరట..

తీర్పు ఇచ్చింది. అవసరమైన ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు కొనసాగించలేమని పేర్కొంటూ రాహుల్ గాంధీ పిటిషన్‌ను అనుమతించింది. దీంతో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను కూడా రద్దు చేసింది. 2022లో మహారాష్ట్రలో సాగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ సావర్కర్‌పై వ్యాఖ్యలు చేశారు. సావర్కర్ బ్రిటీషర్లకు సేవకుడిగా వ్యవహరించారని, బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకునేవారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై న్యాయవాది నృపేంద్ర పాండే దిగువ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కలిగించడంతో పాటు వర్గాల మధ్య విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో దిగువ కోర్టు ప్రాథమికంగా కేసు విచారణకు అర్హమైనదేనని భావించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 153ఏ, 505 సెక్షన్ల కింద రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. అయితే సుప్రీంకోర్టు విచారణలో కీలక లోపం బయటపడింది. ఈ సెక్షన్ల కింద కేసు కొనసాగించేందుకు అవసరమైన ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని తేలింది. దీంతో ఆ లోపాన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు మొత్తం క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

## హిందూ కుటుంబాలను వేధిస్తూ.. మైనారిటీలకు ఉచిత విద్యుత్ ఇస్తారా?

సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన... కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామనే రీతిలో సీఎం మాట్లాడటాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు. నిబంధనలు పాటించడం లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగిందనే సాకుతో హైడ్రా ద్వారా పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు చూపించని సానుభూతిని, విద్యుత్ బిల్లులు చెల్లించని మైనారిటీల విషయంలో ఎందుకు చూపిస్తున్నారని నిలదీశారు. ఒకవైపు సామాన్య పేద హిందూ కుటుంబాలపై హైడ్రాను ప్రయోగిస్తూ వేధింపులకు గురిచేస్తూ... మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు కట్టకపోవడాన్ని సమర్థిస్తూ ప్రోత్సహించేలా మాట్లాడటం కాంగ్రెస్ నైజానికి నిదర్శనమని మండిపడ్డారు. హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, ఖిలాఫత్ ఉద్యమం నాటి నుంచి నేటి వరకు వారి విధానంలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు.

## హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!

సోషల్ మీడియా వేదికగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వైఖరిపై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. పార్టీ నేతలు, జనసైనికులు, వీర మహిళలు పోస్టులు పెట్టేటప్పుడు, వివిధ అంశాలపై స్పందించేటప్పుడు భాష విషయంలో సంయమనం పాటించాలని, పరిధి దాటవద్దని ఆయన స్పష్టంగా దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం, అసభ్య పదజాలం ఉపయోగించడం సరికాదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో, ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తరుణంలో పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

## వికసిత్ భారత్ కోసం అందరూ కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని, అంతర్గత భద్రతలో సాధించిన విజయాలను, ఆర్థిక ప్రగతిని ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ఉగ్రవాదులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై భారత్ తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను రాష్ట్రపతి ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్', సింధు జలాల ఒప్పందం నిలిపివేత వంటివి చరిత్రాత్మక నిర్ణయాలని అభివర్ణించారు. "ఆపరేషన్ సిందూర్ మన సైనిక దళాల అసమాన పరాక్రమానికి నిదర్శనం. ఉగ్రవాదంపై భారత సైన్యం ఎంత కచ్చితత్వంతోనైనా చర్యలు తీసుకోగలదని ఈ ఆపరేషన్ నిరూపించింది. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా, వారి చర్యల పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని ఇది గట్టి సందేశం పంపింది" అని ఆమె స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాల రీత్యా, ముఖ్యంగా రైతుల శ్రేయస్సు దృష్ట్యా తీసుకున్న కీలకమైన ముందడుగు అని తెలిపారు. గడిచిన పదేళ్లలో దేశం "వికాస్, విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమన్వయం చేసుకుంటూ వేగంగా పురోగమించిందని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' కింద దాదాపు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు ఆకర్షించడమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని ఆమె పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి పారదర్శకతను పాటిస్తామని ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. దేశ జనాభాలో 65 శాతం ఉన్న 35 ఏళ్లలోపు యువతే స్టార్టప్ వ్యవస్థకు చోదక శక్తిగా నిలుస్తోందని, దేశ ఉజ్వల భవిష్యత్తుకు వారే సారథులని కొనియాడారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగి ప్రజాస్వామ్య పునాదులు బలపడుతున్నాయని అన్నారు. క్రీడల నుంచి రక్షణ రంగం వరకు మహిళలు సాధిస్తున్న విజయాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చారిత్రాత్మక విజయమని రాష్ట్రపతి అభివర్ణించారు. ఒకప్పుడు మావోయిజంప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు సమ్మిళిత అభివృద్ధి జరుగుతోందని, ఇటీవల బస్తర్‌లో జరిగిన 'బస్తర్ ఒలింపిక్స్' ఇందుకు నిదర్శనమని చెప్పారు. '

# రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు. శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ ఏ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను



అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు కేటాయించిన తెలంగాణ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించి, ఆగస్టు నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'గోదావరి పుష్కరాలు-2027'పై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కరాల ఏర్పాట్లపై శాఖల వారీగా జరుగుతున్న పురోగతిని కమిటీ సభ్యులు సమీక్షించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే 'టైర్-1' ప్రాంతాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. కీలక ప్రాంతాల్లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా సీనియర్ అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి, స్థానిక నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులు, పండితులను భాగస్వాములను చేయాలని సూచించారు. భక్తులకు సేవ చేసేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలన్నారు. పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే పుష్కరాలు విజయవంతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

## 22 కి.మీ. రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారు



అమరావతి రాజధాని నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన పేరుతో కూటమి ప్రభుత్వం భారీగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, అమరావతి అనేది అద్భుత నగరం ఎంతమాత్రం కాదని అన్నారు. అది కేవలం అవినీతి, దోపిడీకి నిలయంగా మారిందని విమర్శించారు. రాజధాని నిర్మాణాలు ఎప్పటికీ పూర్తి కావని... తాత్కాలిక భవనాలు, స్టీల్ బ్రిడ్జిల పేరుతో అప్పులు చేసి మరీ వేల కోట్ల రూపాయలు తగలేస్తున్నారని అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తూ, 22 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 1,519 కోట్ల ఖర్చు చూపిస్తున్నారని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కిలోమీటర్ రోడ్డుకు రూ. 180 కోట్లు ఖర్చు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు సరైన న్యాయం జరగలేదని, కమీషన్ల కోసమే అంచనాల బడ్జెట్‌ను పెంచుకుంటూ పోతున్నారని మండిపడ్డారు.

# విద్యతోనే సామాజిక మార్పు, రాజ్యాధికారం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డంకి కాకూడదని, తల్లిదండ్రులకు భారం కాకుండా ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని సీఎం తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేయకుండా ఈ ఏడాది నుంచి క్రమం తప్పకుండా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ముందస్తుగానే రూ. 2,400 కోట్లు, అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ. 250 కోట్లు అడ్వాన్స్ గా పెడుతోందని వెల్లడించారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం అనే పరిస్థితి ఇకపై ఉండదని హామీ ఇచ్చారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు (నైపుణ్యం) పెంచుకుంటే విదేశాలకు పంపించే బాధ్యత, క్రీడల్లో రాణిస్తే ఉద్యోగాలతో పాటు భారీ నగదు నజరానాలు అందించే బాధ్యత తనదని 'రేవంతన్న'గా భరోసా ఇచ్చారు. సమాజంలో జంతువులు, చేపల లెక్కలు కూడా ఉండేవి కానీ, బలహీన వర్గాల జనాభా ఎంత ఉందో స్పష్టమైన లెక్కలు లేవని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రానికి , గొప్పలు చెప్పుకునే ప్రధాని మోదీకి సవాలు విసురుతూ.. గుజరాత్‌లో కూడా చేయని విధంగా తెలంగాణలో ధైర్యంగా బీసీ కుల గణన చేపట్టి బలహీన వర్గాల సంఖ్యను తేల్చామని చెప్పారు. అసెంబ్లీలో వ్యతిరేకతలు ఎదురైనా ప్రత్యేక కమిషన్ వేసి విజయవంతంగా సర్వే పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వాల ఆలోచన బీసీలను గొర్రెలు, బర్రెలు, చేపలు పట్టే పనులకే పరిమితం చేయాలని ఉండేదని, ఎందుకంటే చదువుకుంటే రాజ్యాధికారం అడుగుతారనే భయమే దానికి కారణమని విమర్శించారు.

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు రాష్ట్రంలో సంచలనాత్మక సామాజిక మార్పుకు వేదికగా నిలవబోతున్నాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. "మీరంతా బాగా చదివి సమాజంలో మార్పు తీసుకురావాలి, ఎమ్మెల్యేలు , ప్రజాప్రతినిధులుగా ఎదిగి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి" అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఇలాంటి ప్రభుత్వాన్ని నిరంతరం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

## నేను కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదు

కాంగ్రెస్ పార్టీలో బయట నుంచి వచ్చిన వారి పెత్తనం ఎక్కువైందంటూ తాను చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో రాజకీయ చర్చ నడుస్తున్న వేళ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఎక్కడా కాంగ్రెస్ పార్టీ నాయకులను కానీ, పార్టీని కానీ విమర్శించలేదని... విమర్శించబోనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని... భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధి కూడా ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోనే తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతానని స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకుని దశాబ్దాలుగా జెండా మోసిన అసలైన కాంగ్రెస్ నాయకులకు, తెలంగాణ ఉద్యమకారులకు ప్రజాపాలనలో తగిన గుర్తింపు లభించాలనే ఉద్దేశంతోనే తాను మాట్లాడానని ఆయన చెప్పారు. సీమాంధ్ర పాలకులు, కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో తెలంగాణ ప్రభుత్వం లేదా పార్టీ నడవకూడదని సూచించారు. ప్రజాపాలన అంటే కేవలం పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల కోసం కాదని... పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేయాలని స్పష్టం చేశారు.

# డేటా సెంటర్లకు నీటి సరఫరాపై అది దుష్ప్రచారం మాత్రమే

(మొదటి పేజీ తరువాయి)

వాటర్ మూవ్‌మెంట్ ప్లాన్‌కు అనుగుణంగానే నీటి నిర్వహణ చేపట్టాలని, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వలతో పాటు భూగర్భ జలాలను అత్యంత సమర్థంగా వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటివరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఇటీవల గోదావరికి 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగించామని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల మనోభావాలను గౌరవించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి విశాఖపట్నం వరకు ఎడమ కాలువ పనులను పూర్తి చేయాలని గడువు విధించారు. పోలవరం కుడి, ఎడమ కాలువలకు మంచి పేర్లను సూచించాలని కోరారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేయవద్దని రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు పెంచేందుకు 'జలధార-జలహారతి' కార్యక్రమాలను కొనసాగించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాధాన్యతగా గుర్తించిన 36 ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు, నిర్వాసితుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా, అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఉన్న ఆయకట్టుకు నీరందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. (ఇంజినీర్ ఇన్ చీఫ్), వివిధ ప్రాజెక్టుల సీఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# దేశభక్తి చాటేలా.. రామన్నపేటలో భారీ ర్యాలీ

**ప్రధాని మోదీ పిలుపుతో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహణ**

**అధిక సంఖ్యలో హాజరైన నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు**

**తొలివెలుగు, రామన్నపేట :** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు రామన్నపేట పట్టణంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయవాదం, దేశభక్తి, ఐక్యతను చాటుతూ ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు స్థానిక కళాశాల లెక్చరర్లు, మదర్ తెరిసా, వివేకానంద పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య, మండల ఇన్‌చార్జి కొరివి శంకర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కట్ట యాదయ్య హాజరయ్యారు. జాతీయ ఐక్యతను చాటేలా సాగిన ఈ ర్యాలీ రామన్నపేట ప్రధాన వీధుల గుండా ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్, సీనియర్ నాయకులు డోగుపర్తి సుభాష్, గోపగోని ధర్మరాజు, మధ్యలపురి ఐలయ్య, జల్లా లక్ష్మీనారాయణ, సిరిపురం ఉపసర్పంచ్ మూడుదుడ్ల అనూష రమేష్, మండల ఉపాధ్యక్షులు బట్టే రమేష్, రేపాక లింగస్వామి, నాయకులు సురివి హరిబాబు, రాపోలు రమేష్, సింగూ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**విద్య, ఉపాధి, క్రీడలపై దృష్టి సారించాలి**

**డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రాము**



**తొలివెలుగు, రామన్నపేట :** యువత మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రాము పిలుపునిచ్చారు. మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన డీవైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు.సమాజంలో నేటి యువతను వ్యసనాలు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవా రంగాల్లో రాణించాలని సూచించారు. యువత ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు, యువజన కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువజన సమస్యలపై రాబోయే రోజుల్లో పోరాటాలు ముమ్మరం చేస్తామని వెల్లడించారు.

# మహనీయుల ఆశయాల బాటలో.. రాజాపేట

**సిద్ధమైన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం**

**ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ**

**ఇప్పటికే 9 కొలువుదీరగా.. త్వరలో మరో 5 విగ్రహాల ఏర్పాటు**

**తొలివెలుగు, రాజాపేట :** మహనీయుల త్యాగాలు, సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేస్తూ రాజాపేట 'విగ్రహాల పేట'గా రూపుదిద్దుకుంటోంది. గ్రామంలో ఇప్పటికే తొమ్మిది మంది మహనీయుల విగ్రహాలు కొలువుదీరగా, త్వరలో మరో ఐదు విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వరుసలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 18వ తేదీన ఈ విగ్రహాన్ని వైభవంగా ఆవిష్కరించనున్నారు. గ్రామంలో ఇప్పటికే మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, పొట్టి శ్రీరాములు, స్వామి వివేకానంద, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలు కొలువుదీరి ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయి. త్వరలోనే ఛత్రపతి శివాజీ, దొడ్డి కొమరయ్య విగ్రహాల ప్రతిష్ఠాపనకు శంకుస్థాపనలు జరిగాయని.. వీటికి తోడు వడ్డే ఓబన్న, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాలను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు వివరించారు. ఇవి కూడా పూర్తయితే రాజాపేటలో మొత్తం 14 మంది మహనీయుల విగ్రహాలు ఏర్పాటు కానున్నాయి. స్థల పరిశీలన, ఇతర ఏర్పాట్లపై సంబంధిత వర్గాలతో చర్చిస్తున్నట్లు వెల్లడించారు.



# ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

**యాదగిరిగుట్ట పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి**

**డిజిటల్ హాజరు, ఉచిత మందులపై ఆరా**

**హైరిస్క్ గర్భిణులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశం**





**తొలివెలుగు, యాదగిరిగుట్ట :** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) ద్వారా గ్రామస్థాయిలోని ప్రజలకు అత్యుత్తమ, నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం ఆయన యాదగిరిగుట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**హాజరు నమోదు తప్పనిసరి:**

ఆసుపత్రిలో సిబ్బంది హాజరు పట్టికతో పాటు 'మీ ప్రమాణం' యాప్‌లో రోజువారీ హాజరు నమోదు ప్రక్రియను, జిల్లా అధికారిక వెబ్‌సైట్ (ఏబీఎచ్‌ఏ) లో నమోదైన వివరాలను కలెక్టర్ పరిశీలించారు. విధులకు ఎవరైనా గైర్హాజరయ్యారా అని ఆరా తీశారు. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ వచ్చే ఓపీ రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రోగులకు కావలసిన అన్ని రకాల మందులను సిద్ధంగా ఉంచాలని ఫార్మసిస్ట్‌ను ఆదేశించారు.

**గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ:**

ల్యాబ్‌లో జరుగుతున్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, స్థానికంగా అందుబాటులో లేని పరీక్షల నమూనాలను ఏ ల్యాబ్‌కు పంపిస్తున్నారో విచారించారు. ఆసుపత్రిలో నెలకు జరుగుతున్న ప్రసవాల సంఖ్య, అందులో 'హైరిస్క్' గర్భిణులు ఎంతమంది ఉన్నారనే సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని, నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో జరుగుతున్న సివిల్ నిర్మాణ పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) మనోహర్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తపేటలో 'స్వర్ణకంచి' డైమండ్ ఎగ్జిబిషన్

**- ఈ నెల 14 నుంచి 16 వరకు మూడు రోజుల ప్రత్యేక ప్రదర్శన**

**- ఐజీఐ సర్టిఫైడ్ వజ్రాభరణాల ప్రత్యేక కలెక్షన్**

**- క్యారెట్, మేకింగ్ చార్జీలు, వీఏలో ఆకర్షణీయ ఆఫర్లు**



**తొలివెలుగు, కొత్తపేట:** కొత్తపేటలోని స్వర్ణకంచి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో 'స్వర్ణకంచి జ్యువెలరీ అండ్ టెక్స్‌టైల్స్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ప్రత్యేక డైమండ్ ఎగ్జిబిషన్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆగస్టు 14 నుంచి 16వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రత్యేక ప్రదర్శనలో వజ్రాభరణాల ప్రియులను ఆకట్టుకునేలా అత్యాధునిక డిజైన్లతో కూడిన అరుదైన ఆభరణాల కలెక్షన్‌ను అందుబాటులో ఉంచారు.

**ఐజీఐ సర్టిఫైడ్ వజ్రాభరణాలు:**

ప్రదర్శనలో ఐజీఐ సర్టిఫైడ్ వీవీఎస్, ఈఎఫ్ క్వాలిటీ వజ్రాలతో రూపొందించిన ప్రత్యేక ఆభరణాలను ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ డిజైన్లతో పాటు ఆధునిక అభిరుచులకు అనుగుణంగా రూపొందించిన వివిధ రకాల డైమండ్ ఆభరణాలు ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

**ఆకర్షణీయ ఆఫర్లు:**

ఎగ్జిబిషన్‌ను పురస్కరించుకుని వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. డైమండ్ క్యారెట్ ధర రూ.46,999గా, గ్రాముకు మేకింగ్ చార్జీలు రూ.699గా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే కేవలం 6.99 శాతం ఫ్లాట్ వీ.ఏ ఆఫర్‌ను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక ఆఫర్లు ఎగ్జిబిషన్ కాలానికి మాత్రమే వర్తిస్తాయని తెలిపారు.

**మూడు రోజులపాటు ప్రదర్శన:**

గ్రీన్‌హిల్స్ కాలనీలోని మెట్రో పిల్లర్ నంబర్ 1632 ఎదురుగా ఉన్న స్వర్ణకంచి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో ఈ డైమండ్ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వజ్రాభరణాల కొనుగోలుదారులు ఈ మూడు రోజుల ప్రత్యేక ప్రదర్శనను సందర్శించి, అందుబాటులో ఉన్న డిజైన్లు, నాణ్యత, ప్రత్యేక ఆఫర్లను పరిశీలించి సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# 'ప్రజాయుద్ధనౌక గద్దర్' డాక్యుమెంటరీ పోస్టర్ ఆవిష్కరణ

**- ఆవిష్కరించిన సతీమణి విమల, కుమార్తె వెన్నెల**

**- తరతరాలకు గద్దర్ ఆశయాలు తెలిపేలా నిర్మాణం**




**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రజా యుద్ధనౌక, విప్లవ కవి, తెలంగాణ ఉద్యమ పోరాట స్ఫూర్తి గద్దర్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిస్తున్న 'ప్రజాయుద్ధనౌక గద్దర్' డాక్యుమెంటరీ పోస్టర్‌ను శుక్రవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. గద్దర్ సతీమణి విమల, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, కుమార్తె వెన్నెల చేతుల మీదుగా ఈ పోస్టర్ విడుదల కార్యక్రమం జరిగింది. ప్రముఖ దర్శకుడు, గద్దర్ అవార్డు గ్రహీత బడుగు విజయ్ దర్శకత్వంలో, విమల్ క్రియేషన్స్ సమర్పణలో, 'తమసోమా జ్యోతిర్గమయ' చిత్ర నిర్మాత తడక రమేష్ ఈ డాక్యుమెంటరీని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, బహుజనుల హక్కుల కోసం అడవి నుంచి జనం దాకా పాటనే తుపాకీగా మలచి పోరాడిన యోధుడు గద్దర్ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని, మాటను, పాటను అంకితం చేసిన ఆయన జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకే ఈ డాక్యుమెంటరీని తీస్తున్నట్లు చెప్పారు. ఈ చిత్రానికి గుంటి నాగేష్ సహ నిర్మాతగా, మార్క్ ప్రశాంత్ సంగీత దర్శకుడిగా, రాజు చెన్నూరి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే డాక్యుమెంటరీ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామన్నారు.

# నంబర్ ప్లేట్ లేకపోతే వాహనం సీజ్!

**వలిగొండలో పోలీసుల తనిఖీలు.. 10 ద్విచక్ర వాహనాల జప్తు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి**




**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ మండల కేంద్రంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేని పది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ ఏ. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రధాన రహదారులపై పోలీసు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు హెల్మెట్, వాహన ఇన్సూరెన్స్ లేకుండా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనదారులు నంబర్ ప్లేట్, హెల్మెట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలు ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గ్రామ సేవకే 'వాకిటి లక్ష్మమ్మ' ఫౌండేషన్ అంకితం

**గోస్కొండలో వాటర్ ఫిల్టర్ భవనానికి శంకుస్థాపన**

**ఫౌండేషన్ సేవలు అభినందనీయం: సర్పంచ్ నరేష్ గౌడ్**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** గ్రామ అభివృద్ధితో పాటు ప్రజారోగ్యమే లక్ష్యంగా వాకిటి లక్ష్మమ్మ ఫౌండేషన్ నిరంతరం పనిచేస్తుందని ఫౌండేషన్ ప్రతినిధులు, ఉప సర్పంచ్ వాకిటి బాల్‌రెడ్డి, జంగారెడ్డి తెలిపారు. మండలంలోని గోస్కొండ గ్రామంలో శుక్రవారం నూతన వాటర్ ఫిల్టర్, భవన నిర్మాణానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మునుకుంట్ల నరేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మాతృమూర్తి జ్ఞాపకార్థం ఫౌండేషన్ స్థాపించి, సొంత నిధులతో ఊరి ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు గ్రామానికి శుద్ధ తాగునీరు అందించేందుకు వాటర్ ఫిల్టర్, భవనం నిర్మించడానికి ముందుకు రావడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దుబ్బాక శ్రీకాంత్, లింగాల కళ్యాణి, నాంపల్లి కృష్ణారెడ్డి, మునుకుంట్ల మల్లేష్ గౌడ్, గోపగోని నవనీత, నాయకులు నాంపల్లి రవీందర్ రెడ్డి, గుర్రం శ్రీధర్ రెడ్డి, కందడి రామిరెడ్డి, మర్రి మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వంగూరి పాండు

**నియామక పత్రం అందజేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచన**



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వంగూరి పాండు నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం వంగూరి పాండు మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, సహకార సంఘం అధ్యక్షుడు భారత లవ కుమార్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ శ్రేణులను కలుపుకొని కాంగ్రెస్ వికాసానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు.

## నర్సాపురంలో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

**గ్రామస్తుల సహకారం అవసరం: దుబ్బాసి శ్రీను**



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం నర్సాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ (శుద్ధ తాగునీటి కేంద్రాన్ని) శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దుబ్బాసి శ్రీను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వాటర్ ఫిల్టర్ నిర్వహణ సజావుగా సాగేందుకు గ్రామస్తులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపిరెడ్డి, నాయకులు జనార్దన్ రెడ్డి, భాస్కర్, బొంగోని ఉప్పలయ్య, బంగారెడ్డి, రామ్ రెడ్డి, రాక్యం నరసింహులు, భీమారం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రోత్సాహకం.. దాత దాతృత్వం



**బొందుగుల పాఠశాలకు రూ.5 వేల విరాళం**

**దాత కొండూరి స్వామిని అభినందించిన గ్రామస్థులు**

**తొలివెలుగు, రాజాపేట :** మండల పరిధిలోని బొందుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే క్రీడా, సాంస్కృతిక పోటీల బహుమతుల ప్రదానం కోసం దాత కొండూరి స్వామి రూ.5,000 నగదు విరాళంగా అందజేశారు. తన తల్లిదండ్రులు కొండూరి బాలమ్మ-మల్లయ్యల జ్ఞాపకార్థం స్వామి శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఈ నగదును అందజేశారు. గత ఏడాది కూడా విద్యార్థులను ప్రోత్సహించేందుకు కొండూరి స్వామి ఆతిథ్యం, బహుమతులు అందజేశారని హెచ్ఎం తెలిపారు. వరుసగా రెండో ఏడాది కూడా విరాళం అందజేసి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు సహకరిస్తున్న దాతను గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## చెడు అలవాట్లకు బానిసై.. యువకుడి బలవన్మరణం

**రాజాపేటలో విషాదకర సంఘటన**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**తొలివెలుగు, రాజాపేట :** చెడు అలవాట్లకు బానిసై, మానసిక ఆందోళనకు గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజాపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కరుణాకర్‌కు చెడు అలవాట్లు ఉండటంతో పద్ధతి మార్చుకోవాలని తల్లిదండ్రులు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించారు. అయినప్పటికీ అతడిలో మార్పు రాకపోవడంతో గత కొంతకాలంగా తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. పని ముగించుకుని ఇంటికి వచ్చిన తండ్రి ఫ్యాన్‌కు వేలాడుతున్న కుమారుడిని గమనించి వెంటనే కిందకు దించగా, అప్పటికే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ‘రైతాంగానికి అండగా ప్రభుత్వం’



**చల్లూరులో యూరియా పంపిణీని ప్రారంభించిన పీఏసీఎస్ చైర్మన్**

**ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చొరవతో తీరిన ఎరువుల కష్టాలు.. ధన్యవాదాలు తెలిపిన రైతులు**

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో పిఏసిఎస్ రేణికుంట-రాజాపేట సెక్టర్ పరిధిలో ఏర్పాటు చేసిన యూరియా ప్రత్యేక కేంద్రాన్ని శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న రైతులకు ఈ సందర్భంగా యూరియా బస్తాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో మండలంలో ఒకే యూరియా కేంద్రం ఉండటంతో రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. రైతుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవ తీసుకుని చల్లూరుతో పాటు పాముకుంట, బొందుగుల, రాజాపేటల్లో అదనంగా నాలుగు కేంద్రాలు అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ గౌరయ్య, స్థానిక సర్పంచ్ భీమగాని రూప బాల నరసయ్య గౌడ్, ఉప సర్పంచ్ బొంత సుధాకర్, సీఈఓ సిల్వేరు శేఖర్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య గౌడ్, డిసిసి కార్యదర్శి ఇంజ నరేష్, బైర పాండు, ఐరేని నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ‘రఘునాథపురం బడి.. జిల్లాకే ఆదర్శం’





**పాఠశాలలో సామాజిక తనిఖీలు పూర్తి**

**మధ్యాహ్న భోజనం, రికార్డుల పరిశీలన**

**పాఠశాల పనితీరుపై తనిఖీ అధికారి మల్లేశం ప్రశంస**

**విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ**

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల పరిధిలోని రఘునాథపురం సంగిశెట్టి మెమోరియల్ పాఠశాలలో శుక్రవారం సామాజిక తనిఖీ అధికారి కొల్లూరి మల్లేశం సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిపాలనకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం వడ్డించే తీరును, వంటగది పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడితో వేర్వేరుగా సమావేశమయ్యారు. రఘునాథపురం పాఠశాలను జిల్లాలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయుడు కే. మనోజ్ కుమార్‌ను అధికారి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్, తనిఖీ అధికారితో కలిసి విద్యార్థులకు ఉచితంగా యూనిఫారాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి. శివరామకృష్ణ, కే. శ్రీనివాసచారి, డి. జయప్రద, ఆర్. అపర్ణాదేవి, కే. సత్యనారాయణ, ఎం. సునీత, ఆర్. సరిత, వై. సమ్మిరెడ్డి, పి. శ్రీహరి, బి. స్వప్న, వై. యాదయ్య, వై. బాలకృష్ణ, ఎన్. కృష్ణమూర్తి, టీ. మనీషా, ఎం. భవాని, షబీన్, బి. శ్రీవాణి, జి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతకు త్రివర్ణ పతాకమే ప్రతీక

**నారాయణపురంలో ఘనంగా ‘హర్ ఘర్ తిరంగా’ ర్యాలీ**

**దేశభక్తి నినాదాలతో కదం తొక్కిన నాయకులు, యువత, విద్యార్థులు**

**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శుక్రవారం ‘హర్ ఘర్ తిరంగా’ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక వివేకానంద విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ విగ్రహం మీదుగా చౌరస్తా వరకు కొనసాగింది. నాయకులు, కార్యకర్తలు చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. ర్యాలీ మార్గంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.



**ఏకతకు ప్రతీక త్రివర్ణ పతాకం:**

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వానికి భారతదేశం ప్రతీకగా నిలుస్తోందన్నారు. దేశంలోని రాష్ట్రాలు, భాషలు, సంస్కృతులు వేర్వేరైనా కోట్లాది భారతీయులను ఒకే జాతీయ స్ఫూర్తితో కలిపి ఉంచేది త్రివర్ణ పతాకమేనని పేర్కొన్నారు. జాతీయ జెండా పట్ల ప్రతి ఒక్కరూ గౌరవాన్ని చాటాలని పిలుపునిచ్చారు.

**ప్రజా ఉద్యమంగా ‘హర్ ఘర్ తిరంగా’:**

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయ భావనను మరింత బలోపేతం చేసే గొప్ప ప్రజా ఉద్యమంగా ‘హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమం నిలుస్తోందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి తరం స్మరించుకోవాలని సూచించారు.



**ప్రతి ఇంటిపై జాతీయ జెండా:**

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశం పట్ల గౌరవం, స్వాభిమానాన్ని చాటాలని పిలుపునిచ్చారు. జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను ప్రజల్లో మరింత పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వంగరి రఘు, మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు వెంకటేష్, నాయకులు కోడూరు బీరయ్య, గొల్లూరు యాదగిరి, సాగర్, జక్కర్తి నరసింహ, మెరుగు సైదులు, సంగిశెట్టి లక్ష్మీనారాయణ, బద్దం యాదయ్య గౌడ్, నెల్లికంటి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- దేవలమ్మనాగారంలో విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ
- బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి: సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్‌గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని దేవలమ్మనాగారం సర్పంచ్ సురుగు గౌరీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం గ్రామంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత ఏకరూప దుస్తులను శుక్రవారం సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బడిఈడు వయస్సు కలిగిన ప్రతి చిన్నారిని తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు అనేక సంక్షేమ సదుపాయాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఏడాదికి రెండు జతల ఏకరూప దుస్తులతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలను అందిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు భోజనం అందించడంతో పాటు వారానికి మూడు సార్లు గుడ్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా వసతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్కంటి అనూప్‌రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ అమరావతి, దోనూరి కిరణ్‌రెడ్డి, పాక రాము, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ గట్టు ప్రియాంక, మండల పరిషత్ పాఠశాల చైర్మన్ బొమ్మ సుగుణమ్మ, బొమ్మ రాములు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం ఆలపించడం ప్రతి పౌరుడి బాధ్యత

చౌటుప్పల్‌లో ఘనంగా 'తిరంగా ర్యాలీ'

విద్యార్థులు, నాయకులతో కలిసి జాతీయ జెండాలతో భారీ ప్రదర్శన

దేశభక్తి, క్రమశిక్షణను యువత అలవర్చుకోవాలి: డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు

**తొలివెలుగు, చౌటుప్పల్:** వందేమాతరం జాతీయ గీతాన్ని ఆలపించడం ప్రతి పౌరుడి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో 'తిరంగా ర్యాలీ'ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణ నుంచి ప్రారంభమైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. విద్యార్థులు, యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.

**త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం:**

ఈ సందర్భంగా డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 'వికసిత్ భారత్' సంకల్పంతో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

**యువతలో దేశభక్తి పెంపొందాలి:**

విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని కాసం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జాతీయ జెండా, జాతీయ గీతం పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో మెలగాలని సూచించారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల బిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, నాయకులు జక్కల రాజు యాదవ్, చినుకుని మల్లేశం యాదవ్, బుద్ధ సురేష్, దిండు భాస్కర్, గుజ్జుల సురేందర్‌రెడ్డి, ముత్యాల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# యాదాద్రి క్షేత్రాభివృద్ధికి బృహత్ ప్రణాళికలు

- పాలకమండలి రెండో సమావేశంలో 31 తీర్మానాలకు ఆమోదం
- సొంత ఖర్చులతో భారీ నిర్మాణాలకు దాతల ముందడుగు
- ప్రోటోకాల్ దర్శనాల్లో కీలక మార్పులు.. సిఫారసు లేఖలకు నో!




**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. శుక్రవారం దేవస్థాన గౌరవ ధర్మకర్తల మండలి రెండో సమావేశం యాదగిరిగుట్టలోని ప్రెసిడెన్షియల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. బోర్డు చైర్మన్, సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో ప్రధాన అజెండాలోని 26 అంశాలతో పాటు మరో ఐదు టేబుల్ అజెండా అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించడం, యాదాద్రిని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు.

**రూ.43.12 కోట్లతో దీక్షాపరుల మండపం:**

కొండపై విష్ణు పుష్కరిణి సమీపంలో దీక్షాపరుల సౌకర్యార్థం నూతనంగా 'దీక్షాపరుల మండపం' నిర్మించాలని నిర్ణయించారు. ఈ నిర్మాణానికి సుమారు రూ.43.12 కోట్ల అంచనా వ్యయం అవుతుందని అధికారులు ప్రతిపాదించగా, పాలకమండలి ఆమోదం తెలిపింది. దీక్షలు చేపట్టే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా మండపాన్ని అభివృద్ధి చేయనున్నారు.

**సొంత నిధులతో నిర్మాణాలకు దాతల ముందడుగు:**

యాదాద్రి అభివృద్ధిలో దాతలు కూడా భాగస్వాములు కానున్నారు. బాలాలయం స్థలంలో రూ.9.87 కోట్లతో నిత్య కల్యాణ మండపం, రాయగిరి వద్ద రూ.3.16 కోట్లతో భారీ స్వాగత తోరణం నిర్మాణాలను బోర్డు చైర్మన్ డాక్టర్ ఎం. సత్యనారాయణరెడ్డి సొంత ఖర్చులతో చేపట్టేందుకు ముందుకు వచ్చినట్లు సమావేశంలో వెల్లడించారు. అలాగే కొండకింద రెండో కల్యాణకట్టను రూ.9 లక్షలతో గుండు మల్లయ్య, ఎలక్ట్రానిక్ శంఖు, చక్ర, నామాల లైటింగ్ ఏర్పాటును కొణిదెల సురేఖ, విష్ణు పుష్కరిణి వద్ద కోతుల నివారణకు సోలార్ ఫెన్సింగ్‌ను ఈశ్వరమ్మ యాదవ్ తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిపారు.

**వేద పాఠశాల.. వైదిక విశ్వవిద్యాలయం:**

యాదాద్రి క్షేత్ర పరిసరాల్లో వేద విద్యను ప్రోత్సహించేలా వేద పాఠశాల, వైదిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి బోర్డు ఆమోదం తెలిపింది. అదేవిధంగా సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో మోడల్ గోశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆధ్యాత్మికతతో పాటు గోసంరక్షణ, వైదిక విద్యకు ప్రాధాన్యం కల్పించేలా ఈ ప్రాజెక్టులను రూపొందించనున్నారు.

**'విజన్-2047'కు ఐఎస్‌బీ సహకారం:**

యాదాద్రి క్షేత్రాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 'విజన్-2047' వ్యూహపత్రాన్ని రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన బాధ్యతలను ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లికు అప్పగించాలని తీర్మానించారు. దీర్ఘకాలిక అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు, మౌలిక వసతులు, పర్యాటకాభివృద్ధి తదితర అంశాలను ఇందులో పొందుపరచనున్నారు.

**ఐటీ సేవలకు టీసీఎస్ సహకారం:**

దేవస్థానంలో టికెటింగ్, ఆన్‌లైన్ సేవలు, ఇతర సాంకేతిక వ్యవస్థలను మరింత మెరుగుపరిచేందుకు ప్రముఖ ఐటీ సంస్థ టీసీఎస్ సాంకేతిక సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. డిజిటల్ సేవలను విస్తరించడం ద్వారా భక్తులకు మరింత సులభమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

**సిఫారసు లేఖలకు చెక్:**

ప్రోటోకాల్ దర్శనాల విషయంలోనూ పాలకమండలి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖులు స్వయంగా ఆలయానికి వచ్చినప్పుడు మాత్రమే ప్రోటోకాల్ దర్శనం కల్పించాలని నిర్ణయించారు. సిఫారసు లేఖలు, ఫోన్ మెసేజ్‌లు తీసుకుని వచ్చే వారికి ప్రత్యేక దర్శనం కల్పించబోమని స్పష్టం చేశారు. అలాంటి వారు సాధారణ భక్తుల మాదిరిగానే నిర్ణీత రుసుము చెల్లించి దర్శన టికెట్లు పొందాల్సి ఉంటుందని, కొండపైకి వాహనాల ప్రవేశానికి కూడా నిబంధనల ప్రకారం రుసుము చెల్లించాల్సి ఉంటుందని బోర్డు స్పష్టం చేసింది.

**భక్తుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యం:**

యాదాద్రి క్షేత్రాభివృద్ధికి తీసుకున్న ఈ నిర్ణయాలు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు క్షేత్రానికి మరింత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి దోహదపడతాయని పాలకమండలి సభ్యులు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు పారదర్శకత, భక్తుల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

# మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి





- గంజాయి, గుడుంబా అక్రమ రవాణాపై కఠిన నిఘా
- చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్
- స్టేషన్ ఆవరణలో మొక్క నాటిన ఎస్పీ

**తొలివెలుగు, చిన్నగూడూరు:** గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై కఠిన నిఘా ఏర్పాటు చేసి వాటి నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిన్నగూడూరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన వార్షికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు వివిధ గదులు, రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసుల పనితీరు, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి:**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు బ్లూ కోల్ట్స్, విలేజ్ పోలీస్ ఆఫీసర్లు (వీపీఓలు) నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, స్థానికంగా నేరాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలని ఆదేశించారు.

**గుడుంబా, గంజాయిపై ఉక్కుపాదం:**

గ్రామీణ ప్రాంతాల్లో గుడుంబా తయారీ, అక్రమ మద్యం విక్రయాలపై నిరంతరం నిఘా ఉంచి దాడులు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయికి బానిసలైన యువతను గుర్తించి వారికి కౌన్సెలింగ్ అందించడంతో పాటు డీ-అడిక్షన్ సేవల వైపు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రౌడీషీటర్ల కదలికలపై నిఘా:**

రౌడీషీటర్లు, మాదకద్రవ్యాల కేసుల్లో నిందితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గమనించాలని సూచించారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసులకు సూచించారు.

**పర్యావరణ పరిరక్షణకు మొక్క నాటిన ఎస్పీ:**

పోలీస్‌స్టేషన్ తనిఖీ అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్టేషన్ ఆవరణలో ఎస్పీ డా. శబరీష్ మొక్కను నాటారు. పోలీసు సిబ్బంది కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కుశ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డు వద్దంటూ మున్సిపాలిటీ ముట్టడి

- చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట అంకిరెడ్డిగూడెం వాసుల ధర్నా
- డంపింగ్ యార్డును తరలిస్తామని హామీ ఇచ్చిన చైర్‌పర్సన్

**తొలివెలుగు, చౌటుప్పల్:** అంకిరెడ్డిగూడెం గ్రామంలో నిర్మిస్తున్న డంపింగ్ యార్డు పనులను వెంటనే నిలిపివేసి, జనావాసాలకు దూరంగా మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామానికి సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ లింగోజిగూడెం రెవెన్యూ పరిధిలోని అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీకి చెందిన సర్వే నంబర్ 326లో స్మశానవాటికకు ఆనుకుని మున్సిపల్ చెత్త నిల్వ కోసం డంపింగ్ యార్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. స్మశానవాటిక పక్కన, జనావాసాలు, పాఠశాలలకు సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సరికాదని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ర్యాలీగా తరలివచ్చిన గ్రామస్థులు:**


సర్పంచ్ సుర్వి మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది మహిళలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి డంపింగ్ యార్డు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్, కమిషనర్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డును జనావాసాలు, పాఠశాలలకు కనీసం రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని వారు కోరారు. ప్రస్తుత ప్రాంతంలో పనులను నిలిపివేసి ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.

**తరలింపునకు చర్యలు తీసుకుంటాం: చైర్‌పర్సన్**

గ్రామస్థుల వినతిని పరిశీలించిన చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డును ఇతర ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెండు గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని స్పష్టం చేశారు. సమస్యను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుర్వి సత్తయ్యగౌడ్, నాయకులు బత్తుల అనూష, దొడ్ల అండాలు, రాపోలు రేణుక, యాట శంకరయ్య, పర్ని శ్రీనివాస్‌రెడ్డి, దొడ్ల సెట్టయ్యగౌడ్, పర్నే శ్రీధర్‌రెడ్డి, భీమగోని మల్లేశంగౌడ్, కాకులారం సంజీవరెడ్డి, ఎర్రగోని శ్రీనివాస్, మోడపు పెంటయ్య, మోడెపు జంగయ్య, రాపోలు మల్లేష్, పెండెం లక్ష్మి, ముద్దం భారతి, ముద్ద మంజుల, బొడిగె అమృత, గంగిరెడ్డి మంజుల, కళావతి, గంగిరెడ్డి అండాలు, సుర్వి రాములు, పల్సం అంజయ్యగౌడ్, సుర్వి నరసింహ, ముద్ద మల్లయ్యగౌడ్, పందుల మనీకుమార్, గణేష్, ముద్దం నరసింహ, పర్ని నర్సిరెడ్డి, సత్తిరెడ్డి, కోటయ్య, అంజిరెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటికీ ఆరేండ్లనాటి జీతాలేనా?.. కార్మికుల శ్రమకు విలువేది?

**తొలివెలుగు, హైదరాబాద్:** దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు, ప్రజల జీవన వ్యయం నానాటికీ పెరుగుతున్నాయి. కానీ, మున్సిపల్ కార్మికుల శ్రమకు విలువ పెరుగడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 30,945 మంది మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విలువ 2021 దగ్గరే ఆగిపోయింది.021 నాటి నంబర్ 60, 63 జీవో ల్లో ప్రతిపాదనలను అనుసరించి గత నెలలో జారీచేసిన జీవో 1181 ఇందుకు కారణమైంది. ఈ జీవో వల్ల వేతనాల్లో తమకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని మున్సిపల్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని, పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా తమ వేతనాలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ ఆందోళనలు రాష్ట్రమంతటా విస్తరించే అవకాశాలున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. రాష్ట్రంలోని మున్సిపాలిటీ ల్లో 30,945 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సేవలను 2027 మార్చి 31 వరకు లేదా రెగ్యులర్ పోస్టులు భర్తీ అయ్యే వరకు, లేదా సేవల అవసరం ముగిసే వరకు కొనసాగించేందుకు జీవో 1181 ద్వారా ప్రభుత్వం అనుమతి ఇ చ్చింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, నాన్-పబ్లిక్ హెల్త్‌వర్కర్లకు రూ.15,600, డ్రైవర్లు, పబ్లిక్ హెల్త్‌వరర్లు, వర్ ఇన్‌స్పెక్టర్లకు 16,600, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.19,500, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్లకు రూ.35 వేల చొప్పున చెల్లించాలని నెలవారీ వేతనం చెల్లించాలని ఆ జీవోలో పేర్కొన్నది. ఆరేండ్లలో అన్ని వస్తువు ల ధరలు భారీగా పెరిగిపోయాయని, అందు కు తగ్గట్టుగా వేతన సవరణ లేకపోవడం వల్ల తమ ఆదాయం తగ్గిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరిగిపోతున్నప్పటికీ 2021లో నిర్ణయించిన వేతనాలనే ఇప్పుడూ కొనసాగించడం, ఆ వేతనాలను కూడా ఐఎఫ్‌ఎంఐఎస్-డీబీటీ ద్వారా కాకుం డా థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా చెల్లించాలని పేర్కొనడం ఏందని గగ్గోలు పెడుతున్నారు.



# స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు**

**మోడల్ స్కూల్ - చౌటుప్పల్ హైవే వరకు సీసీ రోడ్డు నిర్మించాలి**

**విద్యార్థుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ వినతి**

**తొలివెలుగు, చౌటుప్పల్:** విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేసి ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



**రూ.10,814 కోట్ల బకాయిలు విడుదల చేయాలి:**

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించే కళాశాలల యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించాలి:**

విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి, పెండింగ్ బకాయిల విడుదలకు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరినట్లు శ్రీనివాస్ తెలిపారు.

**మోడల్ స్కూల్‌కు సీసీ రోడ్డు నిర్మించాలి:**

చౌటుప్పల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ నుంచి చౌటుప్పల్ హైవే వరకు సీసీ రోడ్డు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం మట్టి రోడ్డు ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాలు కురిసిన సమయంలో రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలు మరింత కష్టతరమవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని మోడల్ స్కూల్ నుంచి హైవే వరకు సీసీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరారు. ఈ సమస్యను కూడా ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సుర్వి అరవింద్, సాత్విక్, శ్రీశాంత్, అజయ్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి





- నిజాయితీతో పనిచేస్తే ఆలయ సమస్యలన్నీ పరిష్కరిస్తా
- సీతారామచంద్రస్వామి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం
- హాజరైన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం చిన్న కొండూరు రోడ్డులో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాలకమండలి సభ్యులు చర్యలు తీసుకోవాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ఆలయ అర్చకులు, నూతన పాలకమండలి సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ ఎమ్మెల్యేను ఆలయానికి ఆహ్వానించారు. అనంతరం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారిణి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నూతన చైర్మన్ బొబ్బిళ్ల మురళి గురుస్వామితో పాటు ధర్మకర్తలు ప్రమాణ స్వీకారం చేశారు.

**అంకితభావంతో సేవ చేయాలి:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ పాలకమండలి సభ్యులు దేవుడి విషయంలో పూర్తి నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం పాలకమండలి సభ్యులు నిజాయితీగా పనిచేస్తే ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆలయ ప్రతిష్ఠను మరింత పెంచేలా నూతన పాలకమండలి సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

**నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకారం:**

నూతన ధర్మకర్తలుగా వరకల రవిగౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్‌రెడ్డి, గగులోతు అరుణ్‌నాయక్ బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకమండలి సభ్యులకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్‌కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, స్థానిక కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటా

**సీమాంధ్ర నేతల పెత్తనాన్ని మాత్రమే ప్రశ్నించా**

**తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు దక్కాలి: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

**తొలివెలుగు, చౌటుప్పల్:** తాను రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్న ఆయన.. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలపై మరోసారి స్పష్టత ఇచ్చారు.




**కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదు:**

తాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏ నాయకుడినీ విమర్శించలేదని, భవిష్యత్‌లోనూ విమర్శించబోనని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బయట నుంచి వచ్చిన కొందరు నేతల పెత్తనం పెరిగిపోవడంతో అసలైన కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు అణచివేతకు గురవుతున్నారనే విషయాన్ని మాత్రమే ప్రశ్నించానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మగౌరవంతో పోరాడిన ఉద్యమకారులకు ప్రస్తుత ప్రజా పాలనలో తగిన గుర్తింపు, గౌరవం లభించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం సీమాంధ్ర నేతలు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో నడవకూడదని సూచించారు.

**ప్రజా పాలన అంటే పేదల సంక్షేమం:**

ప్రజా పాలన అంటే పేదలు, సామాన్య ప్రజల కోసం పనిచేయడమే తప్ప పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం పనిచేయడం కాదని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమానికి కాంగ్రెస్ అండగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని, రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ ప్రజల సమస్యల పరిష్కారం, తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేస్తానని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.




## భారత్‌లో ఒరాకిల్ 12,000 మందికి ఉద్వాసన

### ప్రపంచవ్యాప్తంగా 30,000 ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ: యూఎస్ ఐటీ దిగ్గజం ఒరాకిల్ తాజాగా దేశీయంగా విధులు నిర్వహిస్తున్న 12,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు తెలుస్తోంది. ఈ బాటలో ప్రపంచవ్యాప్తంగా 30,000 ఉద్యోగాలకు కోత పెట్టినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. వచ్చే నెలలో మరింత మందిని ఉద్యోగాల నుంచి తప్పించనున్నట్లు సమాచారం. దేశీయంగా కంపెనీలో సుమారు 30,000 మంది పనిచేస్తున్నారు. అయితే ఈ అంశాలపై స్పందించేందుకు ఒరాకిల్ నిరాకరించడం గమనార్హం! సిబ్బందికి ఈమెయిల్ ద్వారా ఉద్యోగ కోత వివరాలను ఒరాకిల్ వెల్లడించినట్లు తెలుస్తోంది. కనీసం ఏడాదిపాటు సేవలందించిన ఉద్యోగులకు 15 రోజుల వేతనంసహా.. లీవ్ ఎన్‌క్యాబమెంట్, అర్హతగలవారికి గ్రాట్యుటీ తదితర ప్రయోజనాలు ఆఫర్ చేస్తోంది.

## బంగారం ధరలు.. ఊహకందని మార్పులు!




ఇటీవల కాలంలో బంగారం ధరలు గంటల వ్యవధిలోనే ఊహకందని విధంగా మారిపోతున్నాయి. ఉదయం ఒక రేటు ఉంటే.. సాయంత్రానికి మరో రేటు ఉంది. ఈ రోజు కూడా ఇదే బాటలు గోల్డ్ రేటు అడుగులు వేసింది. ఈ కథనంలో దేశంలోని ప్రధాన నగరాల్లో పసిడి ధరలు ఎలా ఉన్నాయో వివరంగా తెలుసుకుందాం. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 136850 రూపాయల వద్ద ఉన్న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర, సాయంత్రానికి 137050 రూపాయల వద్దకు చేరింది. అంటే ఉదయం నుంచి సాయంత్రానికి ధర రూ.200 పెరిగింది. 24 క్యారెట్ల ధర రూ. 149290 నుంచి 149510 రూపాయల వద్దకు చేరింది. ఇదే ధరలు బెంగళూరు, ముంబై నగరాల్లో కూడా కొనసాగుతాయి.ఢిల్లీలో కూడా ధరలు పెరిగాయి. 24 క్యారెట్ల ధర 10 గ్రాముల బంగారం ధర 149660 రూపాయల వద్దకు చేరగా.. 22 క్యారెట్ల తులం గోల్డ్ రేటు 137200 రూపాయాల వద్దకు చేరింది. ఈ రేట్లు ఉదయానికి, సాయంత్రానికి చాలా తేడా ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది.అయితే.. చెన్నై నగరంలో మాత్రం బంగారం ధరల్లో ఎలాంటి మార్పు లేదు. కాబట్టి 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రేటు 136700 రూపాయల వద్ద, 24 క్యారెట్ల తులం పసిడి ధర 149130 రూపాయల వద్ద ఉంది. కేజీ వెండి ధర రూ.250000 వద్ద ఉంది. ఈ రోజు (మంగళవారం) కేజీ సిల్వర్ రేటు రూ.5000 తగ్గడంతో రూ.2.5 లక్షల వద్ద నిలిచింది. అయితే ఢిల్లీలో వెండి రేటు రూ.5000 పెరిగింది. దీంతో అక్కడ కేజీ సిల్వర్ ధర రూ.2.5 లక్షల వద్ద ఉంది.

## పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు ఇలా..

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, పీపీఎఫ్ సహా చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను కేంద్రం వరుసగా ఎనిమిదో త్రైమాసికంలోనూ యథాతథంగా కొనసాగించనుంది. 2026--27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి సంబంధించి ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు వివిధ స్మాల్ సేవింగ్స్ స్కీములపై వడ్డీ రేట్లలో మార్పులేమీ ఉండవని ఆర్థిక శాఖ సోమవారం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం సుకన్య సమృద్ధి స్కీముపై 8.2 శాతంగా, మూడేళ్ల టర్మ్ డిపాజిట్లపై 7.1 శాతంగా, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీములపై వరుసగా 7.1 శాతం, 4 శాతంగా వడ్డీ రేట్లు ఉంటాయి. కిసాన్ వికాస పత్రాలపై 7.5 శాతం, ఎన్ఎస్‌సీలపై 7.7 శాతం, మంత్లీ ఇన్‌కం స్కీముపై 7.4 శాతంగా వడ్డీ రేటు కొనసాగుతుంది. కేంద్రం చివరిసారిగా 2023--24 నాలుగో త్రైమాసికంలో కొన్ని పథకాల రేట్లను మార్చింది.

# క్రెడిట్ కార్డుతో ఆస్తులు కొంటున్నారా? చిక్కులు తప్పవు



విదేశాల్లో, అందులోనూ దుబాయ్‌లో సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకుంటున్న భారతీయులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా అంతర్జాతీయ క్రెడిట్ కార్డులను (ఐసీసీ) ఉపయోగించి దుబాయ్‌లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు పెట్టిన పలువురికి నోటీసులు జారీ అవుతున్నాయి. అజాగ్రత్తగా చేసిన ఈ లావాదేవీలు ఇప్పుడు 'ఫెమా' ఉల్లంఘనల కింద ఇన్వెస్టర్లను ఇరకాటంలో పడేసింది. దుబాయ్‌లోని రియల్ ఎస్టేట్ డెవలపర్లు పంపిన పేమెంట్ లింక్‌ల ద్వారా లేదా నేరుగా అక్కడికి వెళ్లినప్పుడు క్రెడిట్ కార్డుల ద్వారా భారతీయులు భారీగా చెల్లింపులు చేశారు. ప్రాథమిక డిపాజిట్లు చెల్లించడానికి చాలా మంది ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. అయితే, భారతీయ విదేశీ మారకద్రవ్య నియంత్రణ చట్టాల ప్రకారం ఇది తీవ్రమైన నేరం.

**చట్టం ఏం చెబుతోంది?**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం.. లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద ఒక భారతీయుడు ఏడాదికి గరిష్టంగా 2,50,000 డాలర్ల వరకు మాత్రమే విదేశాల్లో పెట్టుబడి పెట్టవచ్చు. ఇది అధికారిక బ్యాంకింగ్ ఛానెల్స్ ద్వారానే జరగాలి. అంతర్జాతీయ క్రెడిట్ కార్డులను కేవలం కరెంట్ అకౌంట్ లావాదేవీలకే (హోటల్ బిల్లులు, షాపింగ్, సర్వీసులు) వాడాలి. క్రెడిట్ కార్డ్ లావాదేవీ అనేది ఒక రకమైన స్వల్పకాలిక రుణం. విదేశాల్లో ఆస్తులు కొనడానికి క్రెడిట్ కార్డులో అప్పు తీసుకోవడాన్ని ఆర్‌బీఐ నిషేధిస్తుంది.

**ఇన్వెస్టర్ల పరిస్థితి**

నోటీసులు అందుకున్న వారు ఇప్పుడు అటు ఆస్తిని వదులుకోలేక, ఇటు చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోలేక సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో క్రెడిట్ కార్డ్ ద్వారా చేసిన చెల్లింపును వెనక్కి తీసుకోవాలని బిల్డర్‌ను కోరవచ్చు. అయితే, కొత్తగా నిధులు పంపాలంటే ప్రస్తుత డాలర్ రేటు ప్రకారం భారీగా ఖర్చవుతుంది. నిబంధనల ఉల్లంఘనకు గానూ జరిమానా చెల్లించాల్సి రావొచ్చు. ప్రస్తుతం దుబాయ్ రియల్ ఎస్టేట్ మార్కెట్ కొంత మందగించడంతో ఆస్తిని తక్కువ ధరకే విక్రయించాల్సి ఉంటుంది.

**పరిష్కారం ఉందా?**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇన్వెస్టర్లు 'కాంపౌండింగ్' ప్రక్రియ ద్వారా ఈ సమస్యను సరిదిద్దుకోవచ్చు. తాము తెలియక చేసిన పొరపాటును అంగీకరిస్తూ ఆర్‌బీఐ వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఒకవేళ నిధుల మూలాలు సక్రమంగా ఉండి హవాలా వంటి అక్రమ మార్గాలు లేవని తేలితే ఈడీ అభ్యంతరం చెప్పకపోవచ్చు. నిబంధనల ప్రకారం కొంత జరిమానా చెల్లించి లావాదేవీని రెగ్యులరైజ్ చేయవచ్చు. ఒకవేళ పొరపాటు చిన్నదైతే ఆర్‌బీఐ రూ.2 లక్షల వరకు పెనాల్టీతో సరిపెట్టే అవకాశం ఉంది. విదేశాల్లో పెట్టుబడులు పెట్టేటప్పుడు కేవలం సౌలభ్యం కోసం క్రెడిట్ కార్డులను వాడటం ముప్పును కొనితెచ్చుకోవడమే. ఇన్వెస్టర్లు నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలి.

# మొబైల్స్, ఏసీ రేట్లకు రెక్కలు



### రూ.20 వేలకు చేరనున్న ఎంట్రీ లెవెల్ 5జీ ఫోన్ ధర


### రూ. 40 వేలకు 3 స్టార్ 1.5 టన్ను ఏసీలు

### ముడి వస్తువుల వ్యయాల పెరుగుదల, రూపాయి పతనం కారణం

ముడి వస్తువుల వ్యయాల పెరుగుదల, రూపాయి విలువ క్షీణిస్తుండటం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల్లాంటి ప్రతికూల పరిస్థితులతో మొబైల్స్, టీవీల నుంచి ఎయిర్ కండీషనర్ల వరకు అన్నింటి రేట్లకు రెక్కలొస్తున్నాయి. గత నవంబర్--డిసెంబర్ నుంచి స్మార్ట్‌ఫోన్లు, టీవీల రేట్లు ప్రతి 30--60 రోజులకోసారి పెరుగుతూనే ఉన్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. సాధారణంగా ఉత్పత్తి పరిమాణం పెరిగే కొద్దీ, ముడి వస్తువుల వ్యయాలు తగ్గి కంపెనీలు చౌకగా ఉత్పత్తులను అందించేందుకు ప్రయత్నిస్తాయి. ఒకవేళ కొన్నాళ్లు పరిస్థితి అటూ ఇటూ అయినా అమ్మకాలను పోగొట్టుకోవడానికి ఇష్టపడక, అదనపు భారమేదైనా పడితే తామే భరించి, రేట్లను పెంచకుండా జాగ్రత్త పడుతుంటాయి. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో భారాన్ని వినియోగదారులకి బదలాయిస్తున్నాయి. దీనితో ఎంట్రీ లెవెల్ టీవీలు, స్మార్ట్‌ఫోన్ల ధరలు తిరిగి 6--8 ఏళ్ల క్రితం నాటి స్థాయికి చేరుకుంటున్నాయి. వేసవి వడగాలి..: ఏసీల్లో పెద్ద ఎత్తున అమ్ముడయ్యే కేటగిరీ ఉత్పత్తులు, ఫ్రిజ్‌లు,, వాషింగ్ మెషిన్ల ధరలు కూడా ఈ నెల నుంచి భారీగా పెరుగుతున్నాయి. తొలిసారిగా కొనుక్కునే వారు ఎక్కువగా మొగ్గు చూపే 3 స్టార్ 1.5 టన్ను ఏసీల రేట్లు గతేడాది వేసవిలో సుమారు రూ. 32,000--34,000గా ఉండగా ఈ ఏప్రిల్‌లో రూ. 37,000--40,000కు పెరగనున్నాయి. కమోడిటీల ధరలు పెరగడం, కొత్త ప్రమాణాల అమలు కారణంగా ఏసీల రేట్లు 12 శాతం వరకు పెరగనున్నట్లు బ్లూస్టార్ గ్రూప్ ప్రెసిడెంట్ మోహిత్ సూద్ ఇటీవలే వెల్లడించారు. ఏప్రిల్ నుంచి ఈ పెంపు అమల్లోకి రానున్నట్లు వివరించారు.మరోవైపు, ఎంట్రీ లెవెల్ 5జీ స్మార్ట్‌ఫోన్ల రేట్లు దీపావళి సమయంలో రూ. 10,000 లోపు ఉండగా, ప్రస్తుతం 13,000--14,000కి చేరాయి. కొన్ని బ్రాండ్స్ అయితే రాబోయే 2--3 నెలల్లో ఈ ఫోన్ల రేట్లు రూ. 20,000కి కూడా చేరొచ్చని చెబుతున్నాయి. 32 అంగుళాల స్మార్ట్ టీవీ రేటు గతేడాది రూ. 6,500 స్థాయిలో ఉంటే, ఇప్పుడు రూ. 8,500గా ఉందని, మే నాటికి రూ. 10,000కు చేరొచ్చనేది పరిశ్రమ వర్గాలు మాట. వివో, ఒప్పో, శాంసంగ్, షావోమీలాంటి బ్రాండ్లు కొన్ని స్మార్ట్‌ఫోన్ల రేట్లను 10 శాతం వరకు పెంచనున్నట్లు సంకేతాలిచి?చనట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మెమొరీ చిప్‌ల రేట్లు గత 5--6 నెలలుగా పెరగడం, గల్ఫ్ యుద్ధంతో పాటు రూపాయి బలహీనపడటమనేది కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వివరించాయి.

**సెకండ్ హ్యాండ్ ఫోన్స్ వైపు చూపు..**

సాధారణంగా త్రైమాసికాలవారీగా రేట్లను తగ్గించడం, డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్‌లు ప్రకటించడం ద్వారా కస్టమర్లను ఆకర్షించేందుకు, తమ ఉత్పత్తులకు డిమాండ్ పెంచుకునేందుకు కంపెనీలు ప్రయత్నిస్తుంటాయి. కానీ ప్రస్తుతం అలాంటివేమీ లేకపోగా రేట్లు మరో పది శాతం వరకు పెరగనున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనితో డిమాండ్‌పైనా ప్రభావం పడుతోంది. కొత్త ఫోన్లకు బదులు సెకండ్ హ్యాండ్, రీఫర్బిబ?డ ఫోన్ల వైపు కొందరు కొనుగోలుదారులు మొగ్గు చూపుతుండగా, మరికొందరు పూర్తిగా కొనుగోలు నిర్ణయాన్నే వాయిదా వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రూ. 20,000 వరకు ఖరీదు చేసే ఫోన్లపై జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించాలంటూ ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేసేందుకు మొబైల్ రిటైలర్ల సంఘం సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఇది 18 శాతంగా ఉంది.



# పోతురాజు ఆహార్యంలో మేఘాంశ్

రియల్‌స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా ఓ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతున్నది. లెల్లా రోహిత్ దర్శకుడు. లెల్లా రాహుల్ నిర్మాత. ఆగస్ట్ 15న శ్రీహరి జయంతిని పురస్కరించుకొని తెలంగాణ సంస్కృతిలో భాగమైన పోతురాజు ఆహార్యంలో ఉన్న మేఘాంశ్ శ్రీహరి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోతురాజు గెటప్‌లో మేఘాంశ్ కనిపిస్తుండగా, అతని నేపథ్యంలో శ్రీహరి కూడా కనిపిస్తుండటం ఈ ఫస్ట్‌లుక్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే 50శాతం ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసుకున్నదని, త్వరలోనే టైటిల్ గ్లింప్స్‌ని కూడా విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ గ్లింప్స్ ద్వారా ఈ సినిమాలోని హీరో ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నట్టు వారు తెలిపారు.



# తెలంగాణ ప్రేమకథ ‘శనార్తి’



‘రాజు వెడ్స్ రాంబాయి’ ఫేమ్ అఖిల్‌రాజ్, తెలంగాణ జానపద గీతాల ద్వారా పేరు తెచ్చుకున్న నాగదుర్గ జంటగా నటిస్తున్న తాజా చిత్రం ‘శనార్తి’ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. సంపత్‌నంది టీమ్ వర్క్స్, శ్రీధనలక్ష్మి ప్రొడక్షన్స్ పతాకాలపై కేవీ శ్రీధర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజ్‌గణేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ సందర్భంగా ఆవిష్కరించిన టైటిల్ పోస్టర్ ‘ఏ టేల్ ఆఫ్ కల్చర్’ అనే ట్యాగ్‌లైన్‌తో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వేడుకల్ని ప్రతిబింబించేలా ఉంది. అగ్ర దర్శకుడు, చిత్ర నిర్మాతల్లో ఒకరైన సంపత్‌నంది చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘తెలంగాణ పల్లెల్లో ప్రజలు ఆత్మీయంగా పలకరించుకునే సందర్భంలో ఉపయోగించే పదం ‘శనార్తి’. ఈ ప్రేమకథకు ఈ పదం అచ్చంగా సరిపోతుంది. అఖిల్‌రాజ్–నాగదుర్గ జోడీ ఈ కథకు బాగా కుదిరారు’ అన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, సమర్పణ: ఆదిత్య మూవీస్, దర్శకత్వం: రాజ్‌గణేష్ ఉప్పునూత.

# ప్రాజెక్టులతో రాశీ ఖన్నా ఫుల్ బిజీ!

తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి రాశీ ఖన్నా, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. దక్షిణాదిలో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తూనే, హిందీలోనూ చేతి నిండా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారారు. ప్రస్తుతం ఆమె ప్రముఖ దర్శకుడు అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ సెట్లోని సరదా క్షణాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. సహనటి విద్యా బాలన్ తనకు ప్రేమగా ఓ బాక్స్ డోనట్స్ బహుమతిగా ఇచ్చారని, ఆ ఫొటోలను షేర్ చేశారు. “ఈ డోనట్స్ అందించిన స్వీటెస్ట్ విద్యా బాలన్ మ్యామ్‌కు థ్యాంక్స్” అంటూ తన పోస్టులో రాశీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాశీ ఖన్నా నటించిన ‘టుక్కే’ అనే వెబ్ సిరీస్ మే 8న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. 8 ఎపిసోడ్ల ఈ మ్యూజికల్ యాక్షన్ డ్రామా సిరీస్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించారు. వీటితో పాటు షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలిసి ‘ఫర్జీ’ సీజన్ 2లో, విక్రాంత్ మాస్సేతో ‘తలాఖో మే ఏక్’, ఆర్. మాధవన్‌తో ‘బ్రిడ్జ్’ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కూడా రాశీ చేతిలో ఉన్నాయి.

# ‘మైసా’ కోసం కసరత్తులు

‘పుష్ప’ ఫ్రాంచైజీ, ‘యానిమల్’ ‘ఛావా’ చిత్రాలతో జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతుల్ని సంపాదించుకుంది అగ్ర నాయిక రష్మిక మందన్న. తాజాగా ఆమె ‘మైసా’ చిత్రంతో కెరీర్‌లోనే ఓ ఛాలెంజింగ్ రోల్‌ని పోషిస్తున్నది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో గిరిజన తెగకు చెందిన గోండ్ మహిళగా కనిపించనుంది రష్మిక మందన్న. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. ఈ సినిమాలోని యాక్షన్ ఘట్టాల కోసం రష్మిక మందన్న ప్రతిరోజూ 8 గంటల కఠోర శిక్షణ తీసుకుంటున్నది. అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండిలాంగ్ పర్యవేక్షణలో బ్యాంకాక్‌లో ఈ ట్రెయినింగ్ జరుగుతున్నది. ‘మైసా’ కథ విన్న తర్వాత పాత్ర కోసం తాను శారీరకంగా, మానసికంగా మరింత దృఢంగా కనిపించాలని రష్మిక నిర్ణయించుకుందని, యాక్షన్ ఘట్టాలన్నీ సహజంగా కనిపించాలనే లక్ష్యంతో బ్యాంకాక్‌లో స్టంట్స్, కంబాట్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదని మేకర్స్ తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. త్వరలో కేరళలో 16రోజుల పాటు జరిగే కీలక యాక్షన్ షెడ్యూల్ కోసం రష్మిక మందన్న ఈ శిక్షణ తీసుకుంటున్నది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాతలు: అన్‌ఫార్ములా ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రవీంద్ర పుల్లె.





# ప్రతిరోజూ కొత్తగా ఉంది

అగ్ర నటి సమంత హాలిడే ట్రిప్‌కి రెడీ అవుతున్నారు. తన ప్రెగ్నెన్సీకి చెందిన ప్రతి క్షణాన్నీ ఆస్వాదించేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారామె. ఎప్పుడూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే సామ్.. తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. ‘ఈ హాలిడేకు రెండు జతల బట్టలు మాత్రమే సర్దుతున్నా. నిజానికి నా దగ్గర చాలా డ్రెస్సులున్నాయి. కానీ అవేమీ ఇప్పుడు నాకు సరిపోవడం లేదు. అందుకే సరిపోయే రెండు జతలు మాత్రమే సర్దుతున్నా’ అంటూ ఆ పోస్టులో పేర్కొన్నది సమంత. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాతృత్వం గురించి సమంత మాట్లాడిన మాటలు కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ‘ ‘అమ్మ’ అని పిలిపించుకునే క్షణాలకోసం నేనెంతో పరితపిస్తున్నాను. నా బిడ్డను మోస్తున్నాననే అనుభూతి నా హృదయాన్ని ఆనందంతో నింపేస్తున్నది. ఈ ప్రయాణాన్ని ప్రతి క్షణం ఆస్వాదిస్తున్నా. నాకెందుకో ప్రతిరోజూ కొత్తగా ఉంది’ అంటూ సమంత భావోద్వేగానికి లోనయ్యారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com